క్లుప్తంగా

సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహానికి స్థలం కేటాయించాలి



ఏలూరు మేయర్ నూర్జహాన్‌కు వినతిపత్రం ఇస్తోన్న అభిమాన సంఘ నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌కు మంగళవారం కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ చాంబర్‌లో మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. దివంగత సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహాన్ని ఏలూరులో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించామనీ, స్థలాన్ని కేటాయించాలని వారంతా కోరారు. ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణకు కూడా అభిమాన సంఘ నేతలు వినతిపత్రాన్ని అందజేశారు.

జ్ఞానంతో లక్ష్య సాధన సులభతరం



విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న విజయ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యార్థులు జ్ఞాన సముపార్జన చేయడం ద్వారా తమ లక్ష్యాలను సులభతరంగా చేరుకోవచ్చని కెరీర్ కౌన్సిలర్ ఆర్. విజయ కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానాలకు వెళ్లడానికి లక్ష్యం ఉండాలని, కృషి, పట్టుదల ఉన్న వారు తాము అనుకున్న లక్ష్యాలను అవలీలగా చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా సెట్‌వెల్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎండీహెచ్ మెహ్రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. మంచి నడవడికతో ఉత్తమ పౌరులుగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీ. సునీత, ఏఓ కేజే కెనడీ, పాఠశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

1 నుంచి నగరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని నగరేశ్వర స్వామి ఆలయంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి స్వామి వారి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామ పెద్దింట్ల రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ వరకూ జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా 1వ తేదీన ఉదయం స్వామి వారిని పెండ్లికుమారుని, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలను చేస్తారన్నారు. సాయంత్రం 7 గంటల నుంచి గణపతి పూజ, ధ్వజారోహణ చేస్తారన్నారు.4వ తేదీ సాయంత్రం ఎదుర్కోలు సన్నాహం, రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. 5వ తేదీన స్వామి వారి రథోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుందని, 6వ తేదీన ఉదయం వసంతోత్సవం, సాయంత్రం ధ్వజపట ఉద్వాసన, 7వ తేదీన ఉత్సవాల ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు స్వామి వారికి పవళింపు సేవ జరుగుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

జాలిపూడి చెరువు లీజును తగ్గించాలి



జాలిపూడి రజక చెరువు పై చర్చిస్తున్న ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు

ఏలూరు రూరల్: రజకులు జీవనస్థితిగతుల ఆధారంగా గ్రామాల్లో రజకుల చెరువులు లీజు నిర్ణయించాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఏలూరు మండలం జాలిపూడి రజక జన సంఘం సభ్యులు ఆత్రగడ్డ శ్రీను, అరికిరేవులు శ్రీరాములు, ఆత్రగడ్డ వెంకన్నతో పాటు వైసీపీ గ్రామధ్యక్షుడు మధ్యాహ్నపు వాసు తదితరులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిశారు. జాలిపూడిలో సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణం గల పంచాయతీ చెరువును రజక సంఘం లీజుకు తీసుకుందన్నారు. లీజు మొత్తం అధికారులు పెంచడం వల్ల ఆర్థికంగా భారమౌతోందన్నారు. గ్రామాల్లో సైతం కులవృత్తి తగ్గిపోయిందన్నారు. ఫలితంగా జీవనం కష్టంగా మారిందన్నారు. చెరువు లీజు ద్వారా వచ్చే ఆదాయంతో భార్యపిల్లలను పోషించుకుంటున్నామని వివరించారు. దీని పై స్పందించిన శ్రీనివాసరాజు ఈఓపీఆర్డీ ఎం సరళకుమారిని పిలిచి లీజు గూర్చి చర్చించారు.

హెల్మెట్ ప్రమాదాల్లో రక్షణ కవచం

- వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే
- మోటారుసైకిల్ ప్రమాదాల్లోనే ప్రాణనష్టం
- అవగాహన కల్పిస్తోన్న ఏలూరు పోలీసులు



రహదారి భద్రతా వారోత్సవాల్లో హెల్మెట్ ధరించి ప్రజలకు అవగాహన కల్పిస్తోన్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, ఏలూరు డీఎస్పీ పైడేశ్వరరావు

ఏలూరు టౌన్: జిల్లాలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల ప్రమాదాలు మరిన్ని జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో చాలా మంది ప్రాణాలు బలిగొంటున్నారు. ఇందులో యువత ఎక్కువగా చనిపోతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై జిల్లా పోలీస్‌లు ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు ప్రమాదాల్లో విలువైన ప్రాణాలు కోల్పోవటం, ఆయా కుటుంబాల జీవన పరిస్థితులపై తీవ్ర ప్రభావాన్నే చూపుతున్నాయని జాతీయ స్థాయి సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టాయి. రోడ్డు ప్రమాదాలను గమనిస్తే మోటారు సైకిల్‌పై ప్రయాణిస్తోన్న వ్యక్తులు ప్రాణాలు కోల్పోవటం బాధిస్తోంది. ముఖ్యంగా యువత మోటారు సైకిల్ ప్రమాదాల్లో చనిపోవటం తీవ్రమైన అంశంగా పరిగణిస్తున్నారు. ఇక రోడ్డు ప్రమాదాల్లో 80శాతం మంది తలకు తీవ్రమైన గాయాలు కావటంతో మృత్యువాతపడుతున్నారని తెలుస్తోంది. ప్రయాదాల్లో క్షతగాత్రులను సకాలంలో హాస్పిటల్స్‌కు తరలిస్తున్నా... తలకు తీవ్రమైన గాయం కావటంతో చికిత్స అందించినా కోమాలోకి వెళ్ళటమో..కొద్దిరోజులకు చనిపోవటమో జరుగుతోంది. ఈ మరణాలకు అడ్డుకట్ట వేయాలంటే కేవలం హెల్మెట్ ధరించటం ఒక్కటే పరిష్కారంగా భావిస్తున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలోని జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై బ్లాక్‌స్పాట్స్ గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేస్తూ బోర్డులు ఏర్పాటు చేయటం, వేగాన్ని నియంత్రించేలా బారికేడ్లు, సైన్ బోర్డులు పెడుతున్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాలకు ప్రయాణించే వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముందుగా వాహనదారులకు అవగాహన కల్పించటం, స్కూళ్లు, కాలేజీల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. తొలుత స్వల్పంగా జరిమానాలు విధిస్తూ హెల్మెట్ ధరించాలని చెబుతున్నారు. అనంతరం కఠినమైన చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

హెల్మెట్ ధరించాలి



ఏలూరు నగరంలో వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. ఇప్పటికే రెండు నెలల నుంచీ ప్రజలకు హెల్మెట్ ధరించటంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు మీ పిల్లలకు మోటారు సైకిళ్లను కొనుగోలు చేయటంతో పాటు హెల్మెట్ కూడా ఇవ్వాలనీ, అధిక వేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు చెప్పాలని వారికీ చెబుతున్నాం. విలువైన ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని వాహనదారులు ప్రయాణాలు చేయాలని కోరుతున్నాం.

– జీవీఎస్ పైడేశ్వరరావు, ఏలూరు ఇన్‌ఛార్జ్ డీఎస్పీ

యువత ప్రాణాలు విలువైనవి



దేశానికి యువశక్తి ఎంతో ముఖ్యం. యువత తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి. రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే అత్యధిక సంఘటనల్లో తలకు తీవ్ర గాయాలు కారణంగానే మృత్యువాత పడుతున్నారని, ముఖ్యంగా యువత చనిపోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. హెల్మెట్ ధరించటంతో ప్రాణాపాయం నుంచి రక్షణ లభిస్తుంది. తాను మరణిస్తే కుటుంబ సభ్యుల పరిస్థితి గురించి వాహన చోదకులు ఆలోచించాలి. మన నిర్లక్ష్యం కుటుంబానికి శిక్ష కాకూడదు.

– బోణం ఆదిప్రసాద్, సీఐ ఏలూరు వన్‌టౌన్

పథకాలకు అర్హతే ప్రామాణికం

- ఎన్నికల హామీలు పక్కాగా అమలు
- ఏలూరులో 80వ రోజు గడపగడపకూ
- 24వ డివిజన్‌లో ఇంటింటికీ పాదయాత్రగా
- ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానికి సాదర స్వాగతం



ఏలూరు 24వ డివిజన్‌లో గడపగడపకూ కార్యక్రమంలో మహిళలను సంక్షేమ పథకాలపై ఆరా తీస్తోన్న ఎమ్మెల్యే ఆళ్ళనాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్ : కుల,మతాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 80వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఏలూరు 24వ డివిజన్ ఆదర్శనగర్ ప్రాంతంలో ఎమ్మెల్యే నాని పాదయాత్రగా ఇంటింటికీ వెళుతూ సంక్షేమ పథకాలపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్ కార్పొరేటర్ మాదిరి నిర్మల జేవియర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నానికి భారీ గజమాలలు, మంగళహారతులతో డివిజన్ ప్రజలు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాజకీయ చరిత్రలోనే ఎన్నడూలేని విధంగా ఎన్నికలకు ముందు ఏవైతే వాగ్దానాలు చేశామో వాటిని పక్కాగా అమలు చేసి చూపించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. రాజకీయాల్లో విలువలు పాటిస్తూ మేనిఫెస్టోలోని 90శాతం హామీలు అధికారం చేపట్టిన మొదటి ఏడాది నుంచే అమలు చేయటం సీఎం జగనన్నకే సాధ్యమన్నారు. విద్యానగర్ కాలనీ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ బాబు, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, బండారు కిరణ్‌కుమార్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, యర్రంశెట్టి సుమన్, గరికిముక్కు జయకర్, పోతర్లంక లక్ష్మణ్, అద్దంకి హరిబాబు, కలవకొల్లు సాంబ, ఏఎంసీ డైరెక్టర్లు జక్కుల బెనర్జీ, యుగంధర్ ప్రసాద్, మేతర సురేష్, లీగల్‌సెల్ ప్రత్తిపాటి తంబి, బీసీ నాయకులు పురిపిరెడ్డి నాగేశ్వరరావు, పిట్టా ధనుంజయ్, లక్ష్మీకుమారి, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, పీవో కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

ఏలూరు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం

ఏలూరు నగరంలోని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, పర్యావరణ పరిరక్షణతోపాటు ప్రజలకు స్వచ్ఛమైన గాలి వచ్చేలా మొక్కలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) ఛైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి ఆధ్వర్యంలో నగరంలో భారీగా మొక్కలను కుండీలను ఏర్పాటు చేశారు. ఇడా నిధులు సుమారు రూ.40లక్షలతో 750 కుండీలను ఏర్పాటు చేశారు.

ఏలూరు సత్రంపాడులో భారీ చోరీ

- పట్టపగలే అపార్ట్‌మెంట్‌లో చొరబడిన దొంగలు
- 25కాసుల బంగారం, రూ.2లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తోన్న ఏలూరు సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, త్రీటౌన్ సీఐ వరప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు నగరం సత్రంపాడు సెంటర్‌లో పట్టపగలే ఒక అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌లోకి చొరబడిన దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి వెళ్లి భారీగా నగలు, నగదును అపహరించారు. నిత్యం రద్దీగా ఉండే సత్రంపాడు సెంటర్ సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో చోరీ జరగటంతో జనం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్‌లు పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఏలూరు ఆర్ఆర్‌పేటలో ఎముకల హాస్పిటల్ వైద్యుడు లోకి కృష్ణ సత్రంపాడు సెంటర్‌లోని అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. మంగళవారం యధావిధిగా వైద్యుడు కృష్ణ హాస్పిటల్‌కు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో ఆయన భార్య కుమార్తెను స్కూల్ నుంచి తీసుకువచ్చేందుకు ఫ్లాట్‌కు తాళం వేసి బయటకు వెళ్లి వచ్చారు. 20 నిమిషాల వ్యవధిలోనే ఆమె స్కూల్‌కు వెళ్లి వెంటనే తిరిగి వచ్చేలోపే ఇంట్లోకి దొంగలు వెళ్లటం , బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేయటం క్షణాల్లో జరిగిపోయింది. ఇక దొంగలు పక్కనే ఉన్న ఫ్లాట్‌లో కూడా చోరీ చేసేందుకు తాళం పగలకొట్టినట్లు గుర్తించారు. అయితే ఈ ఫ్లాట్‌కు సెంట్రల్ లాక్ సిస్టం ఉండడంతో విరమించుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. వైద్యుడులోకి కృష్ణ ఫ్లాట్ తలుపు తాళాలు పగలగొట్టిన దొంగ లోనికి వెళ్లి అందుబాటులోనే ఉన్న బీరువా తాళాలు తీసి నగదు, బంగారు నగలు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వైద్యుని భార్య నుంచి వివరాలు సేకరించిన అనంతరం, సీసీ కెమెరా పుటేజీను పోలీసులు పరిశీలించారు. నేరగాళ్లను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.

భాస్కర్ మృతిపై ఎస్టీ కమిషన్ ఛైర్మన్ విచారణ



ఏలూరు ఇరిగేషన్ విశ్రాంతి భవనం వద్ద ఉచ్చల భాస్కర్ మృతిపై విచారణ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఏలూరు మండలం కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన ఉచ్చల భాస్కర్ అనుమానస్పద మృతిపై మంగళవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ ఎం. విక్టర్ ప్రాథమిక విచారణ నిర్వహించారు. ఏలూరు ఇరిగేషన్ విశ్రాంతి భవనానికి చేరుకున్న ఆయన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ మార్చి 6వ తేదీన ఏలూరు మండలం కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన ఉచ్చల భాస్కర్ ప్రమాదవశాత్తు మరణించాడని ఈ మృతి అనుమానస్పద మృతిగా భావించి మృతుడు తండ్రి మహాంకాళి ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశాడన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు విచారణ కోసం కొక్కిరాయిలంక రావడం జరిగిందని, పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. విక్టర్ ప్రసాద్‌ను ఏలూరు ఆర్డీవో కె.పెంచల్ కిషోర్, డీఎస్పీ పైడేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూధనరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదినీ సింగ్, తహసీల్దార్ సోమశేఖర్, దళిత నాయకుల నేతలు అజయ్, కార్పోరేటర్ జాన్, దళిత సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా దళిత కుటుంబాలకు సంబంధించి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం కొక్కిరాయిలంక గ్రామానికి ఎస్సీ కమీషన్ ఛైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్ అధికారులతో కలిసి వెళ్లారు.

పోలవరం ప్రాజెక్టును యధావిధిగా నిర్మించాలి

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు ఎత్తు కుదించకుండా యధావిధిగా నిర్మించే వరకు పోరు ఆగదని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా నిర్మాణం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లా అధ్యక్షుడు మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన సామూహిక నిరాహార దీక్షలు రెండో రోజు ప్రారంభమయ్యాయి. సీపీఐ ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరు హేమ శంకర్, బాడినన రాము, ఎం.వెంకటాచారి, సన్నేపల్లి సాయిబాబు, జమ్మి శ్రీను, కారం దారయ్య, బత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జల వనరుల పెంపునకు కృషి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జల వనరుల పెంపుకు నగర ప్రజలకు కృషి చేయాలని, ఇందుకు గాను విద్యార్థులు ప్రజలను చైతన్యపరచాలని భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పీఎస్ విజయకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో భూగర్భ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన జియాలజీ శాఖాల అధ్యాపకులు పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. భూగర్భ జల వనరుల శాఖ ఏపీడీ ఏఆర్ఎస్ఎస్ మూర్తి, సీనియర్ జియాలజిస్ట్ ఏ. దిలీప్ తదిరులు పాల్గొన్నారు.

యువతకు శరీర దారుఢ్యం అవసరం



బాడీ బిల్డింగ్ పోటీల్లో విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యువతకు శరీర దారుఢ్యం అవసరమని, ఆత్మవిశ్వాసంతో ఏదానై సాధించగలమనే విశ్వాసం ప్రబలంగా ఉంటుందని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పేర్కొన్నారు. నగరానికి చెందిన బొరగం ఫౌండేషన్, రఘు ఫిట్‌జోన్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అమీనాపేట సురేష్ చంద్ర బహుగుణ పాఠశాలలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల కార్యక్రమంలో ఆళ్ల నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత శారీరకంగా చేసే శ్రమ వారి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతుందని, తద్వారా మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. ఇటీవలి కాలంలో యువతలో శారీరక ధారుఢ్యంపై చైతన్యం కలిగి ఎక్కువ మంది బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి చూపతుండడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. జిమ్ సెంటర్ల నిర్వహణ ద్వారా అనేక మంది ఉపాధి పొందుతుండడం శుభపరిణామమన్నారు. మొత్తం 7 కేటగిరీల్లో పోటీలు నిర్వహించగా నగరానికి చెందిన బీ. పవన్ మిస్టర్ ఏలూరు టైటిల్ సొంతం చేసుకున్నాడు. ఈ పోటీలను బొరగం ఫౌండేషన్ సీఈఓ బొరగం దుర్గాప్రసాద్ దొర పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఆర్ పెదబాబు, గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్, మంచెం మైబాబు, బండారు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులం బిల్లులు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): పాడి రైతులకు మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పశుసంవర్ధక శాఖ జెడి జి.నెహ్రూబాబుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పాడి రైతులకు మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులను అన్ని విధాల ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమలో తమ్మినీడి శ్రీనివాసరావు, టి.దొరబాబు, తదతర పాడి రైతులు పాల్గొన్నారు.

బాలురకు పౌష్టికాహారాన్ని అందించాలి

ఏలూరు (టూటౌన్): వసతి గృహంలోని బాలురకు పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. స్థానిక శనివారపుపేటలోని బాలుర వసతి గృహాన్ని మంగళవారం రాజేశ్వరి సందర్శించారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న బాలురతో ఆమె మాట్లాడారు. బాలురకు అందిస్తున్న ఆహార, వైద్య సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే ఆహారం, వైద్యం వంటి విషయాల్లో అసలు రాజీ పడవద్దంటూ వసతి గృహ సిబ్బందికి సూచించారు. అనంతరం జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీల కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఖైదీల యొక్క కుటుంబ సభ్యుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కారాగార సిబ్బంది, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ వేడుకలు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదబలహీన వర్గాలతోపాటు, కార్మికులు, కర్షకుల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని, ఆయన పాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పాలడుగు మురళీశ్యామ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని ఆదేశాల మేరకు ఏలూరు పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంరెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ ఛైర్మన్ నెరుసు చిరంజీవి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ ఖైసర్, పెద్ద సంఖ్యలో కార్మికులు, ఆటో యూనియన్ నాయకులు, వివిధ సంఘాల నేతలు ఉన్నారు.

సహకార సంఘం ద్వారా రైతులకు మరిన్ని సేవలు

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులు అన్ని విధాల లబ్ధి పొందుతున్నారని జాలిపూడి రైతు విశాల సహకార పరపతి సంఘం ఛైర్మన్ బొల్లిముంత రామ్మోహనరావు అన్నారు. మంగళవారం సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కృషితో సహకార సంఘాలు బలోపేతం అయ్యాయన్నారు. అందువల్లనే రైతులకు సకాలంలో రుణాలు అందించగలుగుతున్నామని వివరించారు. రుణదాతలు సకాలంలో చెల్లింపులు చేస్తేనే సంఘం ఆర్థికంగా మరింత బలంగా రూపుదిద్దుకుంటుందన్నారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సహకారంతో గొడౌన్ నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఇదే క్రమంలో రైతులకు సమయానికి ఎరువులు, విత్తనాలు అందిస్తోందన్నారు. అనంతరం 2016 నుంచి 2020 వరకూ నాలుగేళ్ల డివిడెండ్లు సుమారు రూ 12 లక్షల 18వేల రూపాయలను ఛైర్మన్ రామ్మోహనరావు సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కమ్మలి సుబ్బారావు సంఘం వార్షిక ఖర్చు, ఆదాయ వివరాలు సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో పర్సన్స్ మండల నాగసూర్యచంద్రకళరాజు, బండి శోభారావుతో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



